
# వీలునామా

"తన్మయ"



ముఖ్యమైన మూడుఅంతస్తుల భవనం అది.

ఇంటి ముందు పెద్ద తోట. తోటలో చిన్న ఫౌంటెన్.

ఇంట్లో కుక్. సర్వర్, సర్వెంటు వగైరా వగయిరాలు.

పెద్ద బొచ్చుకుక్క. దానికి రోజువారీ తిండికి పెద్దవాడుక మాంసం కొట్టు.

త్రీ ఫేస్ కరెంటు. రేడియోగ్రాం, ఫ్రెజిడర్. ఇంకా అత్యాధునికం, గృహిణికి సౌకర్యం కలిగించే పరికరాలు.

తెలిసిన తెల్లధనం లక్షలు. తెలియని నల్లధనం అపరిమితం.

వంటినిండా రాళ్ళు, నగలు. దాచేందుకు పట్టుబట్టి చీరలు. వాడేందుకు ఫారిన్ ప్రింటు చీరలు.

వంటావిడకి నెలనెలా చీర. వంటమనిషయ్యో. నీటుగా ఉండాలిగా.

సర్వర్ కి యూనిఫాం. మరి సర్వ్ చేయాలిగా అతిధి అభ్యాగతులకు.

పనివాళ్ళకి పండగ చీరలు. మరి భయభక్తులతో మెలగాలిగా.

అవన్నీ క్లీన్ గా ఉంచకునేందుకుగాను వాషింగ్ ఎలెవెన్స్.

ఇంట్లో వాళ్ళ దుస్తులు ఇంట్లోనే ఉతికి, గంజిపెట్టి, ఇస్త్రీచేసే... అదంతా చూసేందుకు ఒక దోబీ.

ఇవి, ఇంకా అమ్మగారి ప్రోగ్రాం, బాబుగారి టైంటేబిల్ మెయిన్టెయిన్ చేసేందుకు ఒక సెక్రటరీ.

హంగులు. ఆడంబరాలు.

అంతస్తులు. ఐశ్వర్యాలు.

ఫియట్‌లు, రోల్సు రాయిస్‌లు, మారిస్ మైనర్లు, ఒక ఇంఫాలా, నాలుగు ప్రభుత్వ జీపులు, ఒక టాక్సీ .... ఇంకా ప్రైవేటు రిక్షాలు ఎన్నో ఆగివున్నాయి.

పెద్ద షామియానా వేశారు తోటముందు గ్రౌండ్‌లో. ఎంతో అందంగా అలంకరించారు. బోలెడంత కరెంటు ఆ రాత్రిని పగలుగా మార్చేస్తోంది.

చక్కని డైనింగ్ టేబిల్స్, ఛైర్సు, అందమయిన టేబిల్‌క్లాత్స్, రంగు రంగుల గాజు గ్లాసులు. చక్కని పింగాణీ ప్లేట్సు.

అక్కడక్కడ తాజా పూలతో ఫ్లవర్ వాజులు. చక్కటి సువాసన వెదజల్లే సాంబ్రాణి కడ్డీలు.

ఆ ఎరేంజిమెంట్సు అన్నీ చాకచక్యంతో ఏర్పాటు చేసిన భవానీని. లేక అమ్మగారిని. లేక మిసెస్ భవానీ షేకర్‌ని అక్కడ ఆసీనులయిన వాళ్ళంతా అభినందిస్తున్నారు.

కొంత మంది స్త్రీలు తమ భర్తలుకూడా ఆవిధంగా కనుసన్నలలో మెలగటం లేదని విచారిస్తున్నారు. సభ్యత కోసం పైకి నవ్వుతున్నారు.

కొంతమంది భర్తలు తమ భార్యలు ఆవిధంగా చాకచక్యంగా ఉండలేకపోతున్నారని మనసులో జెలసీ ఫీలవుతున్నారు. పైకి తేలటం లేదు.

ఆ స్త్రీ లంతా బాబ్డ్‌హెయిర్, పెద్దపెద్ద ముడులు, స్లీవ్‌లెస్‌లు. లోనెక్‌లు, పొడుగు చేతులు, పొట్టి బ్లవుజులు. లిప్‌స్టిక్కులు, నెయిల్ పాలిష్‌లు, రంగురంగు బొట్టులతో అలా—అలా...ఉన్నారు.

ఆ పురుషుల చేతులలో సీసాలు, ముక్కలు, గ్లాసులు, కళ్ళజోళ్ళు, రాళ్ళ ఉంగరాలు, జేబుల్లో వందలు, చేతుల్లో.... ఇలా... ఇలా ఉన్నారు.

అక్కడ నవ్య నాగరికత వెల్లివిరిస్తోంది. సభ్యత, సంస్కారాలు మిడిసిపడుతున్నయ్.

ఆ పార్టీ జరుగుతోంది. భవాని చిన్ననాటి స్నేహితురాలి పిల్లి పిల్లల్నికన్నది. అది పైకి చెప్పే విషయం.

విందు జోరుగా సాగుతోంది. లోపల తినలేని వాళ్లు ఆయాసపడుతున్నారు. బైట తిండికి మొహం వాచిన వాళ్ళు ఆశగా చూస్తున్నారు గేటువైపు.

వాళ్ళకి ప్రతిగా కుక్కల గుంపు.

“అమ్మా!” అంటూ వచ్చాడు రంగన్న పానకంలో పుడక.

హడావిడిగా తిరుగుతూ అజమాయిషీ చేస్తూ, ప్రతివారిని పేరుపేరునా పలకరిస్తున్న అమ్మగారికి బ్రేకు పడ్డట్టయింది.

“ఏమిటి?” పైకి సాదరంగా, లోపల అసహ్యించుకుంటూ అడిగింది భవానీ దేవి. అది గమనించలేని తెలివితక్కువవాడు కాదు రంగన్న.

అయినా .... ...

“బాబుగారికి మందు. పళ్ళు...” ఆ మాటలు పూర్తికాకముందే,

“అరె ఫూల్స్. మీరంతా ఏం చేస్తున్నారు” అని విసుక్కుంటూ లోపలికి వెళ్ళింది భవాని. రంగడు అనుసరించాడు.

కాసేపటికి తిరిగివచ్చి, ఇందాకటి మిసెస్ లింగప్పతో “చూశారా! ఒక్క విషయంలో నేను ఏమరుపాటుగా ఉంటే ఇలాగే అవుతుంది” అని చెప్పింది.

మనసులో తినాలని ఉన్నా, తినలేనట్టు నటిస్తున్న మిసెస్ లింగప్ప “అవునండీ ఈ పనివాళ్లు ఉత్త ఇడియట్స్” అన్నది.

ఉత్త ఇడియట్ అయిన ‘పని’ వాడు రంగన్న “ఈరోజు బాబుగారికి చాలా ఆలస్యం అయిపోయింది” అనుకున్నాడు పైకి వెళ్తూ.

* * *

“రంగా. అబ్బాయిని పిలు” మామగారు ఆయాసపడుతూ అన్నారు.

గబగబా కిందకి వచ్చాడు రంగడు. బాబుగారికింకా రాత్రిమందు మత్తు వదల్లేదు. వారింకా బెడ్‌రూంలోనే ఉన్నారు.

“ఊఁ! లేచాక చెప్తాలే. నువు పైకి

వెళ్లు" అమ్మగారు ఆజ్ఞాపించింది. లేక పోతే తెల్లవారగానే ఇదేం గోల.

ఎలాగో ఈ మాట పెద్దయ్యగారి చెవిన వేశాడు రంగన్న.

"పిలు" చూసుకుని పైకి వచ్చాడు శేఖర్. ఆఫీసుకి వెళ్ళబోతున్నాడు. అంతవరకూ ముసలాయన మనసులో మంటగానే ఉన్నది. ఎలాగో తమాయించుకున్నారు.

"నాకిక్కడ బాగా లేదురా!" అన్నారు. అప్పటికే పైకి వచ్చేసిన ఆ యింటి కోడలి మనసు, మేధ అతివేగంగా పనిచేసినయ్యి. ఎప్పటినుంచో ప్లాను వేసుకుని, ఆచరణలో పెట్టే అవకాశంరాక, పెండింగులో ఉంచిన అమూల్య అభిప్రాయం వెంటనే వెలిబుచ్చింది.

"అవును పెద్దవయస్సు. అందులోనూ పెరాలిసిస్. మామగారు డాక్టరు కంట్రోలులో డైరెక్టుగా వుంటే బాగుంటుంది స్పెషల్ రూంలో ఇద్దరు నర్సులనికూడా ఏర్పాటు చేయవచ్చు. మీరు వెంటనే ఆ పని చేయండి" అన్నది అనునయంగా.

ఆహా! ఎంత చక్కటి ఆలోచన. అంతరార్థం గ్రహించేపాటి తెలివిలేని అమాయకుడైన చంద్రశేఖరం వెంటనే ఒప్పుకున్నాడు. "అవును నాన్నా! మీకు ప్రశాంతంగా ఉంటుందని ఈ మూడో అంతస్తులో ఈ గది ఏర్పాటు చేసినా, మీరు ఆ ఒక్క ప్రశాంతిలో ఎలా వుండగలరు? భవాని చెప్పింది నిజమే. ఆ ఏర్పాటు చేస్తా" అన్నాడు.

తండ్రి నిస్త్రాణగా కళ్ళు మూసుకున్నాడు.

"మామగారు రెస్టు తీసుకోవాలి. మీకు టైమవుతోందికూడా రండి" అని భర్తని వెంట తీసుకుపోతూ "ఆ స్పెషల్ రూం సంగతి మర్చిపోకండి" అని మామగారికి వినిపించేటట్టు, భర్తని హెచ్చరించటం మర్చిపోలేదు. ఆ ఇంటి ఒక్కగానొక్క కోడలు.

# స్వర్ణయుగం

చరిత్ర పుస్తకాలలో
చదివాను స్వర్ణయుగం గురించి.
ఆ స్వర్ణయుగం కోసం
గాలించాను నా జీవిత చరిత్రను.
కొండంత ఆశతో
ఒక్కొక్క పుటనూ
తిప్పగా తిప్పగా
చిట్టచివరికి కనిపించింది.

ఆకలి తీరని
బాధలు మారని
ఖర్చులు తరగని
సౌఖ్యం పెరగని
ఈ రోజు కంటె
నిన్నటి రోజే
స్వర్ణయుగమని తోచింది.
నిన్నటి కంటె
మొన్నటి రోజే
స్వర్ణయుగమని తోచింది.

ఎప్పటి కప్పుడు
ఆ క్రితం రోజే
స్వర్ణయుగమని తోచింది.

—చల్లా రాధాకృష్ణశర్మ

భార్య వెనకాల దిగిపోతున్న భర్త గారిని చూసి రంగడి కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

ఎంతోమందికి జీవనోపాధి కల్పించిన ఆ మహా వటవృక్షం, ఈనాడు, ఊడలు తెగి ఈ విధంగా........

భవాని తప్పు మాత్రం యేముంది? రాత్రి ఆ విందు ఏర్పాటు చేయటంలోని అంతరార్థం వేరేఉంది. అనేకమంది సంఘంలోని పెద్దలు, వ్యాపారస్తులు పాల్గొన్న ఆ విందువల్ల, చంద్రశేఖరానికి ముందు ముందు ఎంత ఉపయోగం? అంత ప్రాముఖ్యంగల విందుమధ్య ఈ రంగన్న, మామగారి విషయం... ఛఛ!

ఇక భరించలేని భవాని ఆ విధంగా చేస్తున్నదంటే.... తప్పు ఎవరిదని. అహా! అసలెవరిదా తప్పు అని.

ముసలాయన పోయాడన్న కబురు వినంగానే దడదడలాడింది భవాని గుండె. డ్రైవరుని పిలిచే తీరికకూడా లేనట్టు ఆసుపత్రికి పరుగెత్తింది. అక్కడే ఉన్న ప్లీడరుని ఆదుర్దాగా అడిగింది ఆస్తి వివరాలు. "వీలునామా రాశారా?"

"ఆ! రాశారు. ఒకటికాదు రెండు" అన్నాడు ప్లీడరు తలవంచుకుని.

"రెండేమిటి?" అర్థం కాలేదు. ముసలాయనకి మతిపోలేదుకదా?

"మొదటిది రాసి మూడు నెలయింది. ఆస్తి మిద్దరిపేర చెరిసగం రాశారు. పిత్రార్జితమయిన ఒక ఎకరం పొలం మాత్రం రంగన్నపేర రాశారు."

అమ్మయ్య. అయినా "ఎప్పుడు రాశారు" అన్నది.

"అదే! మీ మామగారి మూడో అంతస్తులోకి మార్పించిన కొత్తలో నేనొకసారి వచ్చాగా అప్పుడు"

మళ్ళీ సందేహం.

"ఆ రెండోది....?"

"దాన్నికూడా వారు వీలునామాగానే పేర్కొన్నారు. దానివల్ల 'మీకు' ఏమీ నష్టం లేదులెండి" కర్కశంగా పలికిందా ప్లీడరు గొంతు.

"తన శరీరంలో పనికివచ్చే ఏ అవయవమైనా, ఇష్టం వచ్చినట్టు వినియోగించుకునే హక్కు—ఈ హక్కు ఈ హాస్పిటల్ అధికారులకి ఇచ్చేశారు"

"బ్రతికుండగానే నా అంత్యక్రియలు చేస్తోంది రంగా కోడలు" అన్న బాబుగారి మాటలు గుర్తువచ్చి గొల్లుమన్నాడు రంగన్న.

వాడిని విసుక్కునే శక్తికూడా కోల్పోయింది భవాని.

ఎంత శిక్షవేశాడు మామగారు! చంద్రశేఖర్ తన తప్పు అప్పుడు తెలుసుకున్నాడు. ★

వివేకవతియైన స్త్రీని ప్రేమించడం కష్టం. ఆమె పొగడ్తలకు ఏనాటికీ లొంగదు.

— లూయీ డెనోయర్

* * *

అనుభవం లేని ఉత్సాహంవల్ల ప్రమాదాలుంటాయి.

— చెస్టర్ ఫీల్డు

* * *

స్త్రీపై పగబట్టినా, రక్షించినా ఆమె ఎన్నటికీ మరచిపోదు.

— రిచర్డ్